క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



మామిడి తోటను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అంజనప్ప

కదిరి అర్బన్: మండల పరిధిలోని కే.బ్రాహ్మణ పల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీఓ అంజనప్ప పరిశీలించారు. అవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలను పరిశీలించారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకుంటున్న రైతు ఆదినారాయణ మామిడి తోటను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యాన రైతులకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. వాటిని అందిపుచ్చుకుని ఆర్థికంగా బలపడాలని సూచించారు. అనంతరం దిన్నెమీదపల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీధర్‌రెడ్డి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

తనకల్లు: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. పోలీస్‌స్టేషన్ రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీలు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాంభూపాల్ పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో ఆప్తులై..



అంత్యక్రియల కోసం మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం

కదిరి టౌన్: పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న ముస్లిం షేక్ బాబు అనారోగ్యంతో బాధపడుతూ గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతుడికి బంధువులు, తెలిసిన వారు ఎవరూ లేకపోవడంతో కానిస్టేబుల్ రంగేనాయక్ ఈ విషయాన్ని అభిజ్ఞ ఫౌండేషన్ సభ్యుడు అలీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కానిస్టేబుల్ రంగేనాయక్, అలీ, అతడి స్నేహితులు మృతదేహాన్ని ఖబర్‌స్థాన్‌కు తీసుకెళ్లారు. ముస్లిం సంప్రదాయ పద్ధతిలో షేక్ బాబుకు అంత్యక్రియలు చేసి, మానవత్వం చాటుకున్నారు.

17న ఉచిత గుండె వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ హైస్కూల్‌లో ఈనెల 17వ తేదీన ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. గురువారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు కేశగాళ్ల రంజిత్‌కుమార్, వాయల్పాడు హిదయ్‌తుల్లా, జయం రాఘవ, సాకే రవికుమార్, అన్నం మల్లికార్జున, జింకా గిరి, రామ్మోహన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏడీసీసీబీ మేనేజర్ మృతి



కుసుమ రెడ్డి (ఫైల్)

అమడగూరు: ఓడీచెరువు ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ కుసుమ రెడ్డి (37) గుండెపోటుతో మృతి చెందారు. ఇటీవలే అనారోగ్యానికి గురైన కుసుమ రెడ్డి బెంగళూరులో ఆపరేషన్ చేయించుకున్నారు. బుధవారం బెంగళూరుకు వెళ్లి ఆపరేషన్ కుట్లు తీయించుకుని అర్ధరాత్రి ఓడీచెరువుకు చేరుకున్నారు. ఇంటికి వచ్చిన పది నిమిషాల్లోనే గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతురాలికి భర్త కిశోర్‌కుమార్‌రెడ్డి, కుమారుడు, కూమార్తె ఉన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

తలుపుల: కుర్లి రెడ్డివారిపల్లి ఎంపీపీ స్కూల్‌లో చదువుతున్న 72 మంది విద్యార్థులకు గురువారం కదిరి వాసవీ క్లబ్ వారి వనిత ఖాద్రీ సంఘం ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్స్, పెన్సిల్స్, రబ్బర్లు, స్కేల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పద్మావతి, టీనా, ఎండీఎం ఏజెన్సీ చంద్రకళ, దీపిక పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్ల మంజూరు



పుట్టపర్తి: బుక్కపట్నం మండలం గశికవారిపల్లిలో పింఛన్ అందిస్తున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి



గాండ్లపెంట: రెక్కమాను సచివాలయంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న దృశ్యం



ఎన్పీకుంట: లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

ఎన్పీకుంట: కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సామాజిక పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందని ఎంపీపీ ఈటె రాము అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల వ్యాప్తంగా నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సచివాలయాల పరిధిలో 285 నూతన పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తోందని, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆదినారాయణ, సర్పంచులు అంజినమ్మ, రామాంజులు రెడ్డి, విష్ణుమూర్తి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవయ్య, మాజీ ఎంపీపీ సామిరెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, గోవిందు నాయక్, వాటర్‌షెడ్ చైర్మన్ బయారెడ్డి, గ్రామ కన్వీనర్ వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

26 మందికి పింఛన్ల పంపిణీ..

గాండ్లపెంట: మండల పరిధిలోని కురుమామిడి పంచాయతీ రెక్కమాను సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన 26 మంది లబ్ధిదారులకు గురువారం పింఛన్ సొమ్ము అందజేశారు. గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు వైవీ శంకర్‌నాయుడు, జి.పి తండా సర్పంచ్ బుక్యే శాంతమ్మ, సచివాలయ కన్వీనర్ ఖాజావలి, స్థానిక నాయకులు అమృతనాయుడు, గ్రామ వలంటీర్లు మేకల శివప్రసాద్, రమణప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశాంతినిలయం: ఎనుములపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న నాయకులు

ముదిగుబ్బ: మండల పరిధిలోని ముదిగుబ్బ, సానేవారిపల్లిలో కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మీదేవి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: సీఎం వైఎస్ జగన్ అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నారని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం బుక్కపట్నం మండల వ్యాప్తంగా కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుక్కపట్నం సర్పంచ్ నాగలక్ష్మమ్మ, గశికవారిపల్లి సర్పంచ్ గోవిందరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతి, మండల బూత్ లెవల్ మేనేజర్ పతంజలి, బీసీ నాయకుడు బట్టల కేశప్ప, అమర్‌నాథరెడ్డి, మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేశ్, బుక్కపట్నం గ్రామ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మల్లికార్జున, నాగభూషణ పాల్గొన్నారు.

ప్రశాంతినిలయం: పట్టణంలో నూతన పింఛన్ల పంపిణీ పండుగలా కొనసాగుతోంది. పట్టణంలోని అర్హులైన లబ్ధిదారులకు 118 పింఛన్లు మంజూరు చేయగా రెండో రోజు పంపిణీ కొనసాగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, వార్డు ఇన్‌చార్జ్ కవిత, సచివాలయ కన్వీనర్ సూర్యగౌడ్, 15వ వార్డు కౌన్సిలర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



అమడగూరులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

అమడగూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం అమడగూరు గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఆయా కుటుంబాలకు పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాలకు పథకాలను వర్తింపజేస్తున్న ముఖ్యమంత్రి ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయనంతగా అమడగూరు మండల వ్యాప్తంగా సుమారు 14 గ్రామాలకు తారురోడ్లు, గ్రామాల్లో 30 సీసీరోడ్లను వేయించామన్నారు. గత నాలుగన్నరేళ్ల కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. సుమారు మండల వ్యాప్తంగా ఇప్పటికే మొదటి విడతలో భాగంగా 1,800 జగనన్న ఇళ్లను మంజూరు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. భవిష్యత్తులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి తోడుగా నిలవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శేషూరెడ్డి, బత్రాజుల సంఘం రాష్ట్ర డైరెక్టర్ మధుసూధన్‌రాజు, టౌన్ కన్వీనర్ సుధాకర్‌రాజు, కో–ఆప్షన్ మెంబర్ ఖాజాపీర్, సొసైటీ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, బొట్టు స్వామి, సర్పంచులు షబ్బీర్, శ్రీధర్‌రెడ్డి, సురేంద్ర రెడ్డి, ఆదినారాయణ, ఎంపీటీసీ పెద్దప్పయ్య, బూతు కమిటీ కో కన్వీనర్ నరసింహారెడ్డి, సచివాలయ కన్వీనర్ హరినాథరెడ్డి, దొడ్డెప్ప, నాయకులు రంగారెడ్డి, వెంకటరెడ్డి, నక్కలచిన్నప్ప, నాగరాజు, ప్రకాష్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సిభక్తుల్లా, భాషా, శంకర, నారాయణస్వామి, శ్రీరాములు, యస్‌పాల్, మాధవరెడ్డి, నవీన్, పుట్టపర్తి కన్వీనర్ గంగాధర, తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎంపీడీఓ మునెప్ప, ఎస్ఐ వెంకటనారాయణ పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం



కాలేపల్లి వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పీవీ సిద్దారెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

తనకల్లు: అనంతపురం పర్యటకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జిల్లా సరిహద్దు ప్రాంతమైన చీకటిమానిపల్లి వద్ద ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రిని పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, ఆసుపత్రి డైరెక్టర్ రామ్‌దేశాయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గణేష్‌రెడ్డి, తబ్రేజ్, హేమశేఖర్‌రెడ్డి, బాబాఫక్రుద్దీన్, సిద్దారెడ్డి, పూలశీనా, శ్రీరాములు, పవన్ కుమార్‌రెడ్డి, అయూబ్, నరసింహులు, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: మండల పరిధిలోని కొలేపల్లి వద్ద గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కదిరి, పుట్టపర్తి ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వీడ్కోలు పలికారు. అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని తిరుగు ప్రయాణంలో కదిరి మండలం కొలేపల్లి వద్ద స్థానిక నాయకులు కలిశారు.

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

అమడగూరు: అమడగూరు గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

ధర్మవరం వాసికి డాక్టరేట్

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన దేవరకొండ సురేష్‌బాబుకు డాక్టరేట్ దక్కింది. న్యూఢిల్లీలోని సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన సమాజ సేవలో విశేష కృషి చేసిన వారికి ఇచ్చే గౌరవ డాక్టరేట్, ఇంటర్నేషనల్ సంకల్ప అవార్డును యూనివర్సిటీ చైర్మన్ యోగేష్, వైస్ చైర్మన్ అసిష్ గుప్తా చేతులమీదుగా అందుకున్నారు.

ఈ–క్రాప్ బుకింగ్‌తో ప్రయోజనాలు

ఎన్పీకుంట: పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి లోకేశ్వర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని ఎదురుదోన, మేకలచెరువు ఆర్బీకేల పరిధిలో సాగుతున్న ఈ–క్రాప్ నమోదును పరిశీలించారు. మండల వ్యాప్తంగా 9,000 ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 3,000 ఎకరాల్లో మాత్రమే ఈ–క్రాప్ నమోదు చేశారన్నారు. సెప్టెంబరు 30వ తేదీ లోపు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ముదిగుబ్బ: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏలు సనావుల్లా, సత్యనారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని రామస్వామి తండా క్లస్టర్ పరిధిలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి హాజరయ్యారు. పొలాల్లో అమర్చిన లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలపై చర్చించారు. పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మీనరసింహులు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

తలుపుల: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. మండలంలో క్రైం వివరాలు, ఫ్యాక్షన్ గ్రామాలు, గ్యాంబ్లింగ్, సారా తదితర వివరాలపై ఆరా తీశారు. గ్రామాల్లో పోలీస్ నిఘా ఉంచాలని సూచించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

గాండ్లపెంట: మండల కేంద్రంలోని వైఎస్సార్ కూడలిలో గురువారం జరిగిన దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన అబ్రార్ వైఎస్సార్ కూడలి వద్ద మలమీదపల్లికి చెందిన ఆటో డ్రైవర్ రెడ్డిశేఖర్‌పై రాయితో దాడి చేయడంతో తలకు రక్తగాయమైంది. ఈ కేసులో అబ్రార్‌తో దాడికి సహకరించాడని అతడి తండ్రి ఇలియాజ్‌పై కేసు నమోదు చేశారు. దాడిపై విచారించేందుకు పోలీసులు అబ్రార్ ఇంటి వద్దకు వెళ్లగా అతడి కుటుంబ సభ్యులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. ఈ విషయంపై కూడా అతడి కుటుంబ సభ్యులపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ సర్వే పూర్తి చేయాలి

నల్లమాడ: మండలంలో ఆయుష్మాన్ భారత్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్‌డీఓ, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి టీ.శివారెడ్డి అన్నారు. గురువారం యర్రవంకపల్లి, వేళ్లమద్ది, చారుపల్లి, రెడ్డిపల్లి, వంకరకుంట, నల్లమాడ 1,2,3 గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, స్పందన ఈ–సేవలు, సమావేశాల మినిట్స్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ హిందీ దినోత్సవం



హిందీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జంషీద్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ హిందీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు యాసిన్, బాబునాయక్ తయారు చేసిన బోధనా, అభ్యసన చార్టులు, వర్ణమాల, హిందీ కవుల చిత్రపటాలను ప్రదర్శించారు. విద్యార్థులు హిందీలో రాసిన కవితలు చదివి వినిపించారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులు యాసిన్, బాబు నాయక్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనుముక్కల లక్ష్మన్న, లక్ష్మీనారాయణ, అయూబ్ బాషా, బాలాజీనాయక్, శ్రీనివాసులు, ప్రతాప్, సుధాకర్, ఫైరోజ్ బాషా, చంద్రానాయక్, పోతులయ్య, దేవి, రవీంద్రా నాయక్, శివలక్ష్మీ దేవి, మంజు, కళావతి పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల పరిధిలోని మల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ హిందీ దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులకు క్విజ్, చిత్రాలు, నృత్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు శంకర్ నాయక్, ఉపాధ్యాయులు షాకీర్, వెంకటనారాయణరెడ్డి, వంశీ, రవి, సులేమాన్, రజనీకాంత్, నరసింహమూర్తి, కిషోర్, రోజా రమణి, లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

నల్లచెరువు: మండల పరిధిలోని బాలేపల్లి తండాలో వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ దొంగిలించిన వ్యక్తిపై గురువారం పలువురు రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 11వ తేదీన బాలేపల్లి తండాకు చెందిన దాదాపు 8 మంది రైతులకు సంబంధించిన వ్యవసాయ బోర్ల వద్ద నున్న కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిస్తున్నారని గ్రామస్తులకు సమాచారం అందింది. శ్రీనివాసులు నాయక్, మరో మహిళా రైతు వారిని వెంబడించగా దొంగలు తప్పించుకున్నారు. పారిపోయిన వారిలో ఓరువాయి గ్రామం మారిశెట్టి పల్లికి చెందిన శ్రీనివాసులు చారి అనే వ్యక్తిని గుర్తించామని బాధిత రైతులు పోలీసులకు పిర్యాదు చేశారు. కేబుల్ దొంగిలించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు.

మామిళ్లకుంట క్రాస్‌లో గ్యాస్ ప్రమాదం

పుట్టపర్తి అర్బన్: మండలం మామిళ్లకుంట క్రాస్‌లో నివాసం ఉన్న రవినాయక్ జమునాబాయి ఇంట్లో గురువారం గ్యాస్ లీకేజీ కావడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగి వైరింగ్ మొత్తం కాలిపోయిందని బాధితులు తెలిపారు. డోర్, టైల్స్ సైతం ఊడిపోయినట్లు పేర్కొన్నారు. ఫైరింజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పకడ్బందీగా ‘జగనన్న ఆరోగ్య సురక్ష’

బత్తలపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ సౌజన్యకుమారి ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వలంటీర్లు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంఈఓ చాముండేశ్వరి, ఈఓఆర్డీ దివాకర్ పాల్గొన్నారు.

గాండ్లపెంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలతో ఎంపీడీఓ రామానాయక్ సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావాలన్నారు. వైద్యాధికారి మహేశ్వరమారుతి, ఈఓఆర్డీ సునిత, పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఇంటా వైద్యసేవలు అందుతాయని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు.

జగనన్నకు చెబుదాం వాయిదా

నల్లమాడ: జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని కొన్ని అనివార్య కారణాల వద్ద ఉన్నతాధికారులు వాయిదా వేసినట్లు ఎంపీడీఓ కొండన్న, తహసీల్దార్ దేవేంద్రనాయక్ తెలిపారు. కార్యక్రమం నిర్వహించే తేదీని త్వరలో చెబుతామన్నారు.